epaper.manachourasta.com

మన చౌరాస్తా
The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 116 | శనివారం | 21.09.2024



# వెన్నుపోటు రాజకీయం

- కాంగ్రెస్‌లో 'కట్టప్పలు'
- హస్తంలో ఆది నుంచి అదే తీరు..
- ఏకంగా జిల్లా పీఠానికే ఎసరు పెడుతున్న వైనం..!
- హైకమాండ్‌కు కొమ్మూరిపై నిత్యం ఫిర్యాదులు
- అదిష్ఠానానికి తలనొప్పిగా జనగామ రాజకీయం

2లో..



## భూరికార్డుల అప్ లోడ్ స్పీడప్ చేయాలి

- గ్రూప్స్ విద్యార్థులకు సహకారం అందిస్తాం
- యువత లక్ష్యంతో చదవాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

3లో..



General News

# వెన్నుపోటు రాజకీయం

## కాంగ్రెస్‌లో 'కట్టప్పలు'

- హస్తంలో ఆది నుంచి అదే తీరు..
- ఏకంగా జిల్లా పీఠానికే ఎసరు..!
- హైకమాండ్‌కు కొమ్మూరిపై నిత్యం ఫిర్యాదులు
- అదిష్ఠానానికి తలనొప్పిగా జనగామ రాజకీయం



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

రాజకీయాల్లో ఆప్త మిత్రులు గానీ.. శాశ్వత శతృవులు గానీ.. ఉండరంటారు. ఇది జనగామ కాంగ్రెస్‌లో నిజమే అనిపిస్తుంది. ఎందుకంటే ఇక్కడ పార్టీ పరిస్థితిని కొన్నేళ్లుగా గమనిస్తే.. రాష్ట్రంలో అన్ని జిల్లాలకంటే జనగామ రాజకీయాలు గమ్మత్తుగా సాగుతోంది. వర్గపోరుకు జనగామ కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్ అనడంలో అతిశయోక్తి లేదు. గతంలో జనగామలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే చందంగా రాజకీయాలు ఉండేవి. అయితే ఆ సమయంలో పార్టీ సీనియర్ నాయకులుగా ఉన్న మాజీ మున్సిపల్ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణ రెడ్డి, టీపీసీసీ మాజీ సెక్రటరీ కంచ రాములు, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, జాయ మల్లేశ్ తదితరులు పొన్నాలను విబేధించి కొమ్మూరికి సపోర్ట్ చేశారు. ఇక పొన్నాల వర్గీయులుగా ఉన్న ధర్మపురి శ్రీనివాస్, మాజిద్ తదితరుల మధ్య నిత్యం ప్రచ్ఛన్న యుద్ధమే జరిగేది. ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అప్పట్లో నిర్వహించిన పాదయాత్రలో ఇరు వర్గాలు కొట్టుకునేంత పనిచేశాయి. ఎన్నికలకు ముందు కొమ్మూరికి డీసీసీ పదవి రావడం, ఎమ్మెల్యే టికెట్ కూడా ఆయనకే దక్కడంతో పొన్నాల కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ గూటికి వెళ్లిపోయారు. ఆయన వెంట ఉండే నాయకులు కూడా దాదాపు పార్టీ మారిపోయారు. దీంతో కాంగ్రెస్ పార్టీ గాడిలో పడుతుందని అనుకుంటున్న తరుణంలో ఎన్నికల్లో కొమ్మూరి పరాజయం చెందడంతో నేతల మధ్య మళ్లీ విబేధాలు పుట్టుకొచ్చి వర్గపోరు మొదలైంది. అయితే నాడు కొమ్మూరి వెంట ఉన్న నేతలే ఇప్పుడు ఆయనకు వ్యతిరేకంగా మారి బహిరంగ ప్రకటనలు చేస్తూ నిలదీస్తున్నారు. ఇటీవల కలెక్టరేట్ లో జరిగిన ప్రజాపాలన దినోత్సవంలో కొమ్మూరి వేదికపై కూర్చుంటే నిబంధనలకు విరుద్ధంగా వేదికపై ఎలా ఉంటారని సొంత పార్టీ నేతలే నిలదీశారు. దీంతో చేసేది లేక కొమ్మూరి వేదిక దిగి కింద కూర్చున్నారు. ప్రభుత్వ కార్యక్రమంలో రసాభస చేసిన నేతలపై కొమ్మూరి వర్గీయులు హైకమాండ్ ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు ఎవరిపై చర్యలు తీసుకోలేదు.

### హైకమాండ్‌కు రోజుకో ఫిర్యాదు..?

సాధారణ ఎన్నికల్లో ఓటమి తర్వాత డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి నాడు మద్దతు తెలిపి, డీసీసీ పీఠం కోసం పోరాడిన నాయకులే నేడు కట్టప్పలుగా మారారు. అప్పట్లో ఆయనకు అండగా ఉన్న వారంతా ప్రస్తుతం వ్యతిరేక వర్గంగా తయారయ్యారు. కొమ్మూరి చేసిన తప్పులను హైకమాండ్‌కు ఎప్పటికప్పుడు చేరవేస్తూ.. ఆయన సీటుకే ఎసరు పెట్టేందుకు వ్యూహం పన్నుతున్నట్టు తెలుస్తోంది. ఆయనను డీసీసీ ప్రెసిడెంట్‌గా ఉంచితే రాబోయే స్థానిక సంస్థల్లో దెబ్బతింటామంటూ రాష్ట్ర పార్టీకి సంకేతాలు ఇస్తున్నట్టు సమాచారం. జనగామ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కొమ్మూరికి జనగామ, చేర్యాల తప్ప జిల్లాలోని మరో రెండు నియోజకవర్గాలైన పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ లీడర్లు, కార్యకర్తలతో సంబంధాలు లేవని ఆయన వ్యతిరేకులు ప్రచారం చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్‌డీఎఫ్ కింద (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) జనగామకు రూ.10 కోట్లు మంజూరు చేస్తే కొమ్మూరి కమీషన్ల కోసం వాటిని ఇష్టారీతిగా కేటాయించారని కొందరు ఆరోపిస్తున్నారు. వీటి కేటాయింపులు అధికారులు సైతం తలలు పట్టుకున్నారనే వాదన ఉంది. అయితే ఈ నిధులతో చేపట్టిన పనులతో ప్రభుత్వానికి ఎలాంటి మైలేజీ రాలేదని, దీనికి డీసీసీ ప్రెసిడెంట్ వైఖరే కారణమని ఇటీవల కొందరు నేతలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ప్రతిపక్ష నేత ఎమ్మెల్యేగా ఉన్న జనగామ నియోజకవర్గంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేసుకోవడంలో కాంగ్రెస్ వర్గాలు పూర్తి విఫలం కావడానికి కొమ్మూరే కారణం అంటూ మరి కొందరు నేతలు గుసగుసలాడుకుంటున్నారు. మరో వైపు ఇటీవల టీపీసీసీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్ రాష్ట్రంలోని అన్ని డీసీసీలపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో వివాదాస్పదంగా ఉన్న చోట్ల డీసీసీ ప్రెసిడెంట్లను మార్పులు చేసేందుకు ప్లాన్‌లో ఉన్నట్టు సమాచారం.. ఇదే సమయంలో జనగామలోని కొందరు నేతలు కొమ్మూరి తప్పిదాలను ఎత్తిచూపుతూ ఆయనను డీసీసీ పదవి నుంచి తప్పించేందుకు ఎత్తుగడలు వేస్తున్నట్టు తెలుస్తోంది. వారు టీపీసీసీ ప్రెసిడెంట్ అపాయింట్‌మెంట్ కోసం కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఎదురుచూస్తున్నట్టు సమాచారం.

### కొమ్మూరి వైఖరే కొంప ముంచుతోందా!

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి.. సుదీర్ఘ అనుభవం ఉన్న నేత.. అయితే ఆయన కొందరు అనుయాయుల మాటలు విని తప్పుదోవలో పయనిస్తున్నారని కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు అంటున్నారు. సాధారణ ఎన్నికల్లో స్వల్ప మేజార్టీతో ఓడిపోయిన కొమ్మూరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే స్థాయిలో ఇన్‌చార్జిగా సముచిత స్థానం కల్పించింది. ఆయన రాజకీయాలను వదిలి ప్రజాక్షేత్రంలో నిత్యం పని చేస్తే అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. కానీ, కొమ్మూరి తన పార్టీలో ఉన్న 'కట్టప్పల'పై దృష్టి సారించి తన అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారనే అపవాదు ఉంది. ఆయన కట్టప్పలపై కార్యాచరణ వదిలి ముందుకు సాగితే రాబోయే రోజులు బాగుంటాయని విశ్లేషకులు అంటున్నారు. అయితే కాంగ్రెస్‌లో ఉన్న కట్టప్పలు స్వతహాగా చెడ్డవారు కాకపోయినా.. వారికి 'బాహుబలి' సినిమాలో లాగా 'శివగామి దేవి' లాంటి హైకమాండ్ ఆశీస్సులతోనే అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే ఇన్ని నెలలుగా వారు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా అధిష్ఠానం వారిపై చర్యలు తీసుకోవడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా హైకమాండ్ పెద్దలు స్పందించకుంటే పార్టీ మనుగడకే ప్రమాదం తప్పదని కార్యకర్తలు అంటున్నారు.



ఎన్నికల సమయంలో కార్యకర్తల సమావేశంలో కొమ్మూరి (ఫైల్)



# హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ

- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలివే

**హైదరాబాద్, మన చౌరాస్తా :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరిగింది. భేటీ అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.
హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ ఉండేలా నిబంధనలు సడలించాం.

- హైడ్రాకు అవసరమైన సిబ్బందిని వివిధ విభాగాల నుంచి డిప్యుటేషన్ పై రప్పిస్తున్నాం.
- 169 మంది అధికారులు, 964 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కేటాయింపు ఓఆర్ఆర్ లోపల 27 అర్బన్, లోకల్ బాడీలు ఉన్నాయి. 51 గ్రామ పంచాయతీలను కోర్ అర్బన్‌లో విలీనం.
- ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్ ఖరారుకు కమిటీ ఏర్పాటు.
- ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో 12 మందితో కమిటీ. కమిటీ కన్వీనర్‌గా ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ.
- పోలీసు ఆరోగ్య భద్రత స్కీమ్ ఎస్‌పీఎల్‌కు కూడా వర్తింపు.
- మనోహరాబాద్‌లో 72 ఎకరాల్లో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు ఆమోదం.
- 8 వైద్య కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకం. 3 వేలకు పైగా పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్.
- ఖమ్మం జిల్లాలో 58 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఆమోదం.
- ఏటూరునాగారం ఫైర్ స్టేషన్‌కు 34 మంది సిబ్బంది మంజూరు.
- కోస్గి ఇంజినీరింగ్ కళాశాల, హకీంపేటలో జూనియర్ కళాశాల మంజూరు.

# బదిలీలు, పదోన్నతుల అప్పీల్స్‌ను పరిష్కరించాలి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసి 80 రోజులు గడుస్తున్నా అప్పీల్స్ ను పరిష్కరించకపోవడాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) నిరసిస్తోంది. వెబ్ కౌన్సెలింగ్ పద్ధతిలో ప్రక్రియ పారదర్శకంగా జరిగినప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలు, అధికారుల తప్పిదాలు, సమయాభావం, అవగాహన లోపం వలన నష్టపోయిన ఉపాధ్యాయులకు విద్యాశాఖే అప్పీల్స్ కు వారం రోజులు గడువు ఇచ్చింది. ఆమేరకు కొందరు ఉపాధ్యాయులు తమకు నష్టం జరిగిందని అప్పీల్ చేసుకున్నారు. రెండువారాల్లో అప్పీల్స్ పరిష్కారం చేస్తామని జీవోలో పేర్కొన్నారు. కానీ 80 గడిచినా అప్పీల్స్ పరిష్కారం కాకపోవడం చేత ఆ ఉపాధ్యాయులు నిత్యం డైరెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. పాత స్టేషన్‌లో రిలీవై కొత్త స్టేషన్‌లో చేరకుండా కొందరు, రిలీవ్ కాకుండా మరి కొందరు, కొత్త స్టేషన్లో జాయిన్ అయి ఇంకొదరు తమ అప్పీల్ పరిష్కారం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆ ఉపాధ్యాయుల అప్పీల్స్ ను పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉంది. వెంటనే అప్పీల్స్ అన్నింటినీ సానుకూలంగా పరిష్కరించాలని యూఎస్పీసీ స్టీరింగ్ కమిటీ డిమాండ్ చేసింది. అదేవిధంగా బదిలీలు, పదోన్నతుల్లో అక్రమాలకు పాల్పడినవారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరింది.



# భూరికార్డుల అప్ లోడ్ స్పీడప్ చేయాలి

- గ్రూప్స్‌కు సన్నద్ధమయ్యే విద్యార్థులకు సహకారం అందిస్తాం
- యువత లక్ష్యంతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** యువత గ్రూప్స ఉద్యోగాలు సాధించేందుకు కావల్సిన వనరులు కల్పిస్తామని, ఉద్యోగాలు సాధించి జిల్లా పేరును నిలపాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం, జిల్లా గ్రంథాలయం, ఎయిడెడ్ స్కూళ్లను ఆయన సందర్శించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ రికార్డు పత్రాలను అప్‌లోడ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. జనగామ జిల్లా ల్యాండ్ రికార్డ్స్ ప్రోగ్రాం ద్వారా ల్యాండ్ రికార్డ్స్ స్కానింగ్ ప్రక్రియని పైలట్ ప్రాజెక్టు కింద మొదటగా జనగామ మండలాన్ని తీసుకొని మొదలు పెట్టడం జరిగిందన్నారు. ప్రతి రోజు 2 వేల పత్రాలను స్కానింగ్ చేస్తు, ఇప్పటి వరకు 40 శాతం పూర్తి చేశామని, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ రెడ్డి కలెక్టర్ కు వివరించగా, పనితీరును మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని, త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. అదే కార్యాలయంలో ఉన్న ట్రెజరి గదులను పరిశీలిస్తూ వెంటనే పరిశుభ్రం చేయించి కార్యాలయ సిబ్బందికి వినియోగించాలన్నారు. అదే ప్రాంతంలో ఉన్న గ్రంథాలయాన్ని సందర్శించారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా అనుకూలమైన భవనాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. కలెక్టర్ పాఠకులతో మాట్లాడుతూ తాత్కాలిక భవనం ఏర్పాటు చేస్తామని, శాశ్వత భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎయిడెడ్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహన్నాం భోజన నాణ్యతను పరిశీలించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బిల్లులకు సకాలంలో పేమెంట్ వస్తున్నదా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకన్న, ఈడీఎం గౌతమ్ రెడ్డి, డీటీ జగన్ నాయక్, ఎయిడెడ్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శోభా కిరణ్, గ్రంథాలయం నిర్వాహకుడు కృష్ణ ఉన్నారు.



# ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

**జనగామ, మన చౌరాస్తా :**

జనగామ జిల్లా మిలాద్ సోషల్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో జష్నే మిలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, యువకులు రంగురంగుల దుస్తులు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈద్ ఎ మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సౌభ్రాతృత్వ సందేశాన్ని తెలియజేస్తూ శుక్రవారం ప్రార్థనలు చేశారు. అనంతరం రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్, చౌక్ వరకు ఊరేగింపు నిర్వహించారు. యువకులు, చిన్నారులు ఇస్లామిక్ జెండాలను పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మిలాద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ అన్వర్, ఎండీ ఇక్బాల్, బాబా, మెయిజ్, యాకుబ్, రౌఫ్, అబిడ్, రబ్బానీ, హబీబ్, అబ్దుల్లా, సమద్, షకీల్, సలీం తదితరులు పాల్గొన్నారు.



# ఎరువుల దుకాణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పల్లా

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల పట్టణంలోని శ్రీసాయిశివ ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం పల్లాను ఫర్టిలైజర్స్ యజమాని, బీఆర్ఎస్ నేత చేతిరెడ్డి సందీప్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి మిఠాయి తినిపించారు. ఈ మేరకు పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా షాపుల యాజమాన్యాలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు అధైర్యపడొద్దని, అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. అయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంటి, ఏరోళ్ల రామచంద్రం, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ మల్లారెడ్డి, పుల్ల రవి, బుట్టి శ్రీను, ఎలుగల సంపత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సోమేశ్వరస్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా మోహన్‌బాబు

**జనగామ, మన చౌరాస్తా :** మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి ఈవో ఎస్. మోహన్ బాబు జనగామ జిల్లాలోని పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి ఇంచార్జి ఈవోగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆలయ అర్చకులు డీవీఆర్ శర్మతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.



# గంగాపురంలో ఉచిత వైద్య శిబిరం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలం గంగాపురం గ్రామంలో ఆర్‌వీఎం హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామస్తులందరికీ బీపీ, షుగర్, బ్లడ్ టెస్ట్ లు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు జి.దయాకర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పి.నర్సింహులు, మాజీ ఎంపీటీసీ మసూధ్, మధుసూదన్ రెడ్డి, గాల్ రెడ్డి, ఉమాపతి, యాదగిరి పాల్గొన్నారు.



# హిమ్మత్‌నగర్ స్కూల్‌లో అతిథి భోజనం

**జఫర్‌గడ్, మన చౌరాస్తా :** మండలంలోని హిమ్మత్ నగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా ఇటీవల పదోన్నతి వచ్చిన మంగు జయప్రకాశ్ అతిథి భోజనం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఔత్సాహిక తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, విద్యారంగ శ్రేయోభిలాషులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు తరచుగా ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి తమ పుట్టిన రోజు, పెండ్లి రోజు, తమ పిల్లల పుట్టిన రోజులు పురస్కరించుకుని అతిథి భోజనం పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ భోజనం అందించాలని పిలుపునిచ్చిందన్నారు. తాను గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన సందర్భంగా విద్యార్థులకు చికెన్‌తో అతిథి భోజనం అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పసునూరి కవిత, కడారి వసంత, గాదె వెంకట స్వామి, వెంగల జితేందర్, దామెర ఉపేందర్, మోదుగ వనజాత, పోరిక మంజుల, భూక్యా వంశీకృష్ణ, దీకొండ మాధవి, మామునూరి ప్రశాంత, మహ్మద్ జహీరుద్దీన్, అంకేశ్వరపు హరిప్రసాద్, సీఆర్పీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# డీఎంజేఏ జనగామ అధ్యక్షుడిగా నరేందర్

- ప్రధాన కార్యదర్శిగా జితేందర్
- కోశాధికారిగా గుడికందుల కృష్ణ

**జనగామ, మన చౌరాస్తా :** డిజిటల్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ (డీఎంజేఏ) జనగామ అధ్యక్షుడిగా మన చౌరాస్తా ఎడిటర్ ఉప్పలంచి నరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన డిజిటల్ మీడియా జర్నలిస్టుల సంఘ సమావేశంలో నరేందర్‌తో పాటు 12 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పాలమాకుల జితేందర్, ఉపాధ్యక్షులుగా బత్తిని అశోక్, దీకొండ హరీశ్, కోశాధికారిగా గుడికందుల కృష్ణ, సహాయ కార్యదర్శులుగా జేరిపోతుల ఉపేందర్, కార్యవర్గ సభ్యులుగా చిటుకుల అంజయ్య, గుండా రాజు, ప్యాట రాజు, గండి ప్రవీణ్‌కుమార్, చెల్లోజు నవీన్‌చారి, ఎక్కలదేవి ఓంకార్, ఎండీ అఫ్రోజ్ ఎన్నికయ్యారు. ఇక అసోసియేషన్‌కు గౌరవ సలహాదారులుగా సీనియర్ జర్నలిస్టులు మాదంశెట్టి శివకుమార్, కొండా శ్రీనివాస్, శీల కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ ప్రస్తుతం మీడియా రంగంలో డిజిటల్ మీడియా దూసుకుపోతోందన్నారు. ఏ చిన్న ఘటన జరిగినా.. ఏ సమాచారం



అయినా డిజిటల్ మీడియా ద్వారానే ప్రజలకు ముందుగా చేరుతోందన్నారు. ఈ తరుణం ప్రధాన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు కూడా డిజిటల్ వైపు అడుగులు వేస్తున్నాయన్నారు. రాష్ట్రం దాదాపు అన్ని మీడియా సంస్థలు డిజిటల్ ఫ్లాట్‌ఫాంలోకి వచ్చాయన్నారు. రాబోయే రోజుల్లో డిజిటల్ మీడియా హవా మరింత పెరుతుందన్నారు. ప్రభుత్వాలు కూడా డిజిటల్ మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇక అసోసియేషన్ సభ్యులు తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని నరేందర్ పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు డిజిటల్ మీడియా జర్నలిస్టులు బి.విష్ణు, బక్క రవి, బి.సంపత్, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలి

- డీపీవో స్వరూపరాణి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని, తప్పుల తడక లేకుండా సరిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి స్వరూపరాణి అన్నారు. శుక్రవారం మండలంలోని కొడవటూరు సిద్దేశ్వర స్వామి దేవస్థానంలోని సిద్దేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఎంపిడివో మల్లికార్జున్ అధ్యక్షతన పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఓటరు జాబితాపై, స్వచ్ఛత కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 గ్రామపంచాయతీ వార్డు ఓటర్ జాబితా ప్రచురణపై పార్టీల నాయకులకు ముందస్తుగా తెలపడం జరిగిందని, పంచాయితీ పరిధిలోని వార్డుల వారీగా ఒకే కుటుంబంలో ఆ కుటుంబ సభ్యులు అందరూ జాబితాలో ఉండేలా సవరణ చేయాలని, వార్డు లోని వారందరూ ఒకే బూత్ లో ఓటు వేసే విధంగా జాబితా రూపొందించాలని సూచించారు. జిల్లా అధికారులు రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందని పలు పార్టీల నాయకులు సమావేశంలో వెల్లడించిన మేరకు నేడు 21 వరకు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి ఈ నెల 28న తుది జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. గతంలో ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సవరించేందుకు పోలింగ్ బూత్ ల వారీగా బీఎల్వోలు సర్వే చేపట్టినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించడం లేదని, జాబితాలో కొందరి ఓటర్ల పేర్లు, తండ్రి, భర్త పేర్లు తప్పుగా నమోదయ్యాయని, ఒక్కొక్కరికి రెండేసి ఓట్లతో పాటు, మృతిచెందిన వారి వివరాలు జాబితా నుంచి తొలగించలేదని అలాంటి పొరపాట్లు రాకుండా జాబితా సరిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



WANTED విలేకరులు కావలెను

www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

# అందుకే..బాలీవుడ్‌కు నో..!

## ఆసక్తికర విషయం చెప్పిన రమ్యకృష్ణ

మన చౌరాస్తా, సినిమా : 2015 సంవత్సరంలో ఎస్.ఎస్ రాజమౌళి తెరకెక్కించిన 'బాహుబలి' సినిమా ప్రపంచ వ్యాప్తంగా రూ.650 కోట్ల వసూళ్లు రాబట్టింది. అప్పటికి అదే పెద్ద రికార్డ్. ఆ తర్వాత రెండేళ్లకు 2017లో ఈ చిత్రానికి సీక్వెల్ 'బాహుబలి 2' వచ్చింది. వసూళ్ల పరంగా ఈ సినిమా చరిత్ర సృష్టించింది. ప్రపంచ వ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ.1,788 కోట్ల కలెక్ట్ చేసి తెలుగు సినిమా స్థాయి పెంచేసింది. ఈ సినిమాతో ప్రభాస్ పాన్ ఇండియన్ స్టార్ అయ్యాడు, అయితే ఈ సినిమా ప్రభాస్ కు ఎంత పేరు వచ్చిందో మరో నటికి కూడా అంతే పేరు వచ్చింది. ఆమె ఎవరో కాదు ఈ సినిమాలో శివగామి దేవిగా నటించిన రమ్యకృష్ణ. ఈ సినిమా తర్వాత రమ్య క్రేజ్ మరింత పెరిగింది. అప్పటికే టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా రాణించిన ఆమె.. సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టి అడపాదడపా సినిమాలు చేస్తూ వచ్చింది . కానీ శివగామిగా ఆమె చేసిన పాత్ర ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ సినిమాతో ఆమెకు మంచి పాపులారిటీ వచ్చింది. అయితే అంతకు ముందు రమ్యకృష్ణ సౌత్‌తో పాటు బాలీవుడ్ సినిమాల్లో కూడా నటించింది. అయితే కొంతకాలం తర్వాత హిందీ చిత్ర పరిశ్రమకు దూరమయ్యారు. 1983లో 'వెల్లై మనసు' అనే సినిమా విడుదలైంది. ఈ సినిమాతో రమ్య తన సినీ జీవితాన్ని ప్రారంభించింది. ఇది తమిళ్ సినిమా. ఆ తర్వాత భలే మిత్రులు సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టింది రమ్యకృష్ణ. ఆ తర్వాత ఆమె మలయాళం, కన్నడ భాషా చిత్రాలలో కూడా కనిపించింది. అలాగే 1988 సంవత్సరంలో రమ్య తన తొలి హిందీ సినిమా చేసింది. 1988లో ఫిరోజ్ ఖాన్, రాజేష్ ఖన్నా, అమ్రిష్ పూరి నటించిన 'దయావాన్' అనే చిత్రం విడుదలైంది. ఈ సినిమా ద్వారా రమ్యకృష్ణ బాలీవుడ్‌కి పరిచయం అయ్యింది. ఇందులో ఆమె డ్యాన్సర్ పాత్రలో కనిపించింది. ఆ తర్వాత ఈ సీనియర్ బ్యూటీ అమితాబ్ బచ్చన్ , గోవిందాల 'బడే మియాన్ చోటే మియాన్' అలాగే షారుఖ్ ఖాన్ 'చాహత్' వంటి అనేక హిందీ చిత్రాలలో నటించింది. ఆ తర్వాత అనుకోకుండా హిందీకి దూరం అయ్యింది. దీని గురించి గతంలో ఆమె మాట్లాడుతూ.. హిందీ చిత్రసీమలో తన సినిమాలేవీ పెద్దగా ఆడలేదని, అయితే అప్పటికే తాను తెలుగు సినిమాల్లో స్టార్ గా మారిపోయానని అని చెప్పింది. తెలుగు సినిమాని వదిలి బాలీవుడ్‌లో చేసే రిస్క్ తాను తీయను అని అందుకే బాలీవుడ్‌కి దూరంగా ఉంటున్నా అని ఆమె అన్నారు. ఏ ఇండస్ట్రీలో అయినా సక్సెస్ ఫుల్ సినిమా ఇవ్వడమే ముఖ్యమని, తెలుగులో ఇస్తున్నానని, తెలుగులో హాయిగా ఫీల్ అవుతున్నానని రమ్యకృష్ణ చెప్పుకొచ్చారు.